# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు.
- ❖ అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఆమోదం తెలిపింది.
- ❖ పీ4 కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు.
- ❖ శ్రీ వరహలక్ష్మీ నృసింహ స్వామివారు కొలువైన సింహాచలం గిరి ప్రదక్షిణ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానుందని ఆలయ అధికారులు తెలిపారు.
- ❖ రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర వెల్లడించింది.

==============================

రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. నెల్లూరులో వీ.ఆర్.మోడల్ పాఠశాలను ఈరోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు పాఠశాలను తాను దత్తత తీసుకున్నాని చెప్పారు. పట్టుదల, క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చన్నారు. సవాళ్లను స్వీకరించేందుకు అలవాటు పడాలని విద్యార్థులకు సూచించారు. యూనిఫామ్‌లు, మౌలిక సదుపాయాలతో పాటు అన్నింటిని మెరుగుపరిచామని, ప్రపంచంతో పోటీపడేలా విద్యార్థులకు మెరుగైన సాంకేతికత అందిస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొంటూ..

(వాయిస్ 38 సెకన్లు)

==============================

అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఆమోదించింది. జూన్ 30న విజయవాడలో క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో చేసిన డిక్లరేషన్‌కు ఆమోదం లభించింది. ఈ మేరకు ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ

కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతిని క్వాంటమ్ గేట్ వే హబ్‌గా అభివృద్ధి చేసేందుకు "అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్"ను రూపొందించామని తెలిపారు. ఈ క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలు, ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు. కాగా 2035 నాటికి ప్రపంచ క్వాంటం కేంద్రంగా అమరావతిని అభివృద్ధే చేయడమే లక్ష్యమని ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం వెల్లడించింది.

==============================

రాష్ట్రాన్ని 2047 నాటికి దేశంలోని ప్రధమ స్థానంలో నిలిపేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ డాక్యుమెంట్ కు రూపకల్పన చేశారని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్- 2047లో భాగంగా జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, పి4 పై కార్యక్రమంపై మంత్రి ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని తెలిపారు. పాఠశాలల ప్రారంభంలోనే తల్లికి వందనం పేరిట తల్లుల ఖాతాల్లోకి నగదును జమ చేశామని చెప్పారు. ఆగస్టు 15 నాటికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని.. త్వరలో రైతులకు ఆర్థిక సహాయం అందించనున్నామని తెలిపారు. అదేవిధంగా పీ4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేస్తూ....

(వాయిస్ 29 సెకన్లు)

==============================

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారు కొలువు దీరిన సింహాచలం గిరి ప్రదక్షిణ ఈనెల 9 బుధవారం జరగనుంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి పుష్పరధంతో తొలి పావంచ వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.త్రినాధ రావు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. తొలి పావంచ నుండి అడవివరం, హనుమంతవాక, విశాలాక్షినగర్ మొదలగు ప్రాంతాల మీదుగా సుమారు 37 కిలోమీటర్ల మేర పుష్ప రధంతో పాటు, లక్షలాది మంది భక్తులు ఈ గిరిప్రదక్షిణలో పాల్గొంటారని తెలిపారు. భక్తుల సౌకర్యార్ధం కొండ చుట్టూ ఆహారం, మంచి నీరు, మజ్జిగతో పాటు, పారిశుధ్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే పలు చోట్ల వైద్య సిబ్బందిని కూడా నియమించామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు జాగ్రత్తులు తీసుకుంటున్నామని వెల్లడించారు.

విరామం

==============================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈరోజు ఢిల్లీలో పర్యటించిన ఆయన.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో సుమారు 64 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అందుచేత ప్రభుత్వాలు ఈ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 36 సెకన్లు)

==============================

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పూడి గ్రామం నుండి మెలికంచురు వరకు నిర్మించిన రహదారిని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గిరిజన ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి

గిరిజన కుటుంబం సుస్థిర జీవితాన్ని గడిపేలా చర్యల తీసుకుంటున్నామన్నారు. ఈ నూతన రహదారి గ్రామాల అభివృద్ధికి నాంది అని, దీని ద్వారా వైద్యం, విద్య, రవాణా, ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం కావడంతో గ్రామాల అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని వివరించారు.

================================

విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. "మెగా పేరెంట్స్ మీటింగ్" ఏర్పాట్లపై కలెక్టర్ ఈరోజు అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీట్ ను అన్ని విద్యా సంస్థల్లో యాజమాన్యాలు విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలపై తలిదండ్రులకు ఈ మీటింగ్ లో అవగాహన కల్పించాలన్నారు.

================================

శాకంబరి ఉత్సవాలకు విజయవాడ ఇంద్రకీలాద్రి సిద్ధమవుతోంది. రేపటి నుంచి ప్రారంభంకానున్న శాకంబరి ఉత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆషాడ శుద్ధ త్రయోదశి నుంచి ఆషాడ శుద్ధ పౌర్ణమి వరకు ఈ ఉత్సవాలు ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శాకాంబరి ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరణ పనులు ప్రారంభించారు. మహా మండపం 6వ అంతస్తులో ఆలయ కార్యనిర్వహణాధికారి ఈఓ శీనానాయక్, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు... వినాయక పూజ అనంతరం అలంకరణ పనులు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ... సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని... ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారికి విశేషాలంకారం చేస్తున్నామని తెలిపారు.

================================

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం  కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై ఆయన సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదును పరిష్కరించే క్రమంలో సంబంధిత అధికారులు ఫిర్యాదుదారునితో మాట్లాడి సమస్యలను సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని సూచించారు.

================================

గంగా పరివాహక పశ్చిమ బెంగాల్ పరిసర ప్రాంతాలలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 2 రోజుల్లో జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదిలే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల 24 గంటలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు  కొన్ని  చోట్ల  కురిసే అవకాశముందని తెలిపింది.

================================
================================